"సాహసే లక్ష్మీః"

దివాకర్ల శారదామణి

(అనువృత్తము)

౧౦

మఱల నెంతదారుణము!

మఱునాటి మధ్యాహ్నమున నేను నాభర్తగారి వస్తువులను కొన్నిటిని సవరించుచుండగ నొకపెట్టె యందు నామామగారు వ్రాసిన మరణశాసనము నాకంటబడెను. పట్టాభిరామయ్యగారి మాటలు నామనస్సునం నుండుటచేత నేను దానిని మిగుల శ్రద్ధతో జదివితిని. అందు చాలసంగతు లుండెను. "నామరణానంతరమున పదిలక్షల విలువయైన నాయావదాస్తిని నాప్రియకుమారుడైన రాజశేఖరరావు తనపుత్ర పౌత్రపారంపర్యముగ ననుభవించవలెను." అనియుండెను. మఱియు నాభర్తగారి జన్మదివసము 1909 వ సంవత్సరము ఆగస్టు 15 వ తేదీ యనియు దానియందుండెను. మరణశాసనమున.— "రాజశేఖరరావు తనజీవితవ్యాపారములలో సత్యధర్మశౌచాది సద్వర్తనములుకలిగి ఎల్లప్పుడు నన్ని విషయములలోను తన్ను గన్నతండ్రియొక్క పవిత్రాదర్శమును మనఃఫలకమున నుంచుకొని సర్వదా ప్రవర్తింపవలయునని నే నభిలషించుచున్నాను." అని వ్రాసి యుండుట నాకు చిఱునగవు బుట్టించెను.

ఆనాటి సాయంకాలమున నాభర్తగారీక్రింది విధముగ తంతివార్త నంపిరి:

"నేను రాత్రి వచ్చునప్పటికి ఆలస్యమగును. ప్రసాదరావుగారిప్పు డిక్కడ నున్నారు. నాకన్న ముందు నీవద్దకు వచ్చెదరు."

ఆనాటిరాత్రి 9 గంటలగుచుండగ ప్రసాదరావుగారు వచ్చిరి. ఆయన "ఇదేమిటి? ఇంకనూ రాకపోవుట నాకాశ్చర్యముగ నున్నది. నేను సాయంకాల మయిదు గంటలకు వచ్చాను." అప్పుడు సేవకు డొక టెలిగ్రాము పట్టుకొని వచ్చెను. అది అడ్వకేటు పట్టాభిరామయ్యగారు నాభర్తగారిపేర రాజమండ్రీ ఇచ్చిన తంతివార్త. నాభర్తగారక్కడనుండి బయలుదేరి వచ్చుటచేతగాబోలునువారిసేవకు లెవ్వరో తిరుగ దానిని కాకినాడ పంపిరి.

"మీరిచ్చిన తంతివార్తను గూర్చి — నేను పూర్తిగా స్టేటుమెంటు ఇస్తాను. రాత్రి 10-30 లకు తయారగును. గాంధీనగరమున నాబసకు రండి. రేపు రిజిష్టరు చేయించవచ్చు—

పట్టాభిరామయ్య."

ప్రసాదరావుగారికి మిక్కిలి యాశ్చర్యముగ నుండెను.

"ఏమిది? నాకేమీ బోధపడకుండావుంది. పట్టాభిరామయ్యగారితో రాత్రి మాట్లాడవలసియున్నదని నాతో చెప్పేరు. డాక్టరురంగా ఇంకా కొందరు డాక్టర్లు అక్కడఉన్నారు. ఈటెలిగ్రాము ఇక్కడకు రావడం చూడగా వారు ఇది రాజమండ్రీలో ఇచ్చునప్పటికే రాజశేఖరరావుగారక్కడనుండి బయలుదేరి ఉండాలి. అవతల వర్షం కురుస్తోంది. ఏమైనా ఒకసారి పట్టాభిరామయ్యగారి ఇంటికి వెళ్లిచూద్దాము."

మేము కారులో బయలుదేరి గాంధీనగరమునకు వచ్చితిమి. ఆయిల్లే వీథిలో నెచ్చటనున్నదో ప్రసాదరావుగారికి సరిగ జ్ఞాపకములేదు. ఇంటిముఖద్వారము ఉత్తరాభిముఖముగ నున్నదని వారు భావించిరి. కాని ఆవైపునకు కారుద్రిప్పిచూడగా నది దొడ్డిగుమ్మముగా కానవచ్చెను. డ్రైవరును వారు వెంటనే కారునాపివేయమనిరి. మేమిరువురమును కారునుండి దిగితిమి. కారును మాకింకను ఆవలకు దోడ్కొనిపోవలసినదని వారాజ్ఞాపించిరి. నన్నుజూచి "ఆదొడ్డిగుమ్మమువద్ద ఏదో కారొకటి ఆగియున్నట్లు ఎర్రటిలైటు కనుపిస్తోంది. ఎందుకువచ్చి అక్కడఆగిందో!" ఆకారువద్దకు వచ్చి చూచితిమి. అది నాభర్తగారి కారే. కాని అందెవ్వరును లేరు.

"చిత్రంగావుంది. మీరు ఇక్కడ వుండండి." అని వారు గుమ్మమువద్దకు వెళ్లి బలముగ దానినొక్కయూపుయూపి దొడ్డిలో ప్రవేశించిరి. వారిచేతనున్న ఎలక్ట్రిక్ కిరణప్రసారమున వారు తొందరగ బోవుచుండిరని నాకు కానవచ్చెను. వారు హఠాత్తుగా నాగిపోయి క్రిందకువంగి అచ్చటబడియున్న ఒకమనుష్యుని పరీక్షించుచుండిరి. నేనాగుమ్మమువద్ద నుండజాలక తక్షణమే వారియొద్దకు వచ్చిచూచితిని. ఆమనుష్యుని చేతియొద్ద నున్న ఒక రివాల్వరును తీసి వారు పరీక్షించి నేను వచ్చులోపలనే తమ జేబులో నుంచుకొనిరి. ప్రసాదరావుగారిచేతి విద్యుత్కాంతి ఆమనుష్యుని ముఖముపై బ్రసరించెను. నా కాకాశము విఱిగి మీదబడినట్లయ్యెను.

"హా! హా! ఘోరం!—నాభర్తగారే? ఏమిది. ప్రాణముతో నున్నారా! కాక—"

"అమ్మా రాజశేఖరరావుగా రెందువల్లనో నిశ్చైతన్యమున పడిపోయి యున్నారు. కాబట్టి మీరాందోళన పడవద్దు.—కాని ఏదో దారుణం జరిగుంటుంది. మీరు నిశ్శబ్దంగావుండి నేను చెప్పినట్లు చేయాలి. లేకపోతే ముందు నాపుట్టి మునిగిపోతుంది. ఈయనకేదో మత్తుమందో, మఱియేమో ఇచ్చివుంటారు. మీరీయనను కారువద్దకు తీసుకువెళ్లడానికి నాకు సహాయం చెయ్యాలి. ఈటార్చి తీసుకొనివెళ్లి మనంవచ్చిన రోల్సు కారును యింటిముందుకు తీసుకొనిపోయి ఆపమని డ్రైవరుతో చెప్పిరండి. నేను ఇక్కడనే వుంటాను."

నేను వారు చెప్పినట్లు చేసితిని. మేమిరువురము చైతన్యశూన్యులై పడియున్న నాభర్తగారిని రోడ్డు ప్రక్కనున్న కారువద్దకు తీసుకువచ్చి అందు కూర్చుండబెట్టితిమి. తరువాత ప్రసాదరావుగారే మా యింటి కాకారును నడుపింప నారంభించిరి. వారు మిగుల నిర్మానుష్యముగనున్న మార్గమున కారును నడిపించి నడుమ సామర్లకోటకాలువమార్గమున కారును త్రిప్పి కాలువవద్ద కారునాపి నాభర్తగారి జేబులలో నున్న రుమాలు నీవలకు దీసి దానిని నీటముంచి నాకందించిరి.

"దీనితో వారిముఖం ప్రక్షాళితమగునట్లు కడగండి. అలాచేస్తే మనం ఇంటికి వెళ్లేటప్పటికి వారికి తెలివొస్తుంది."

ఆయనచెప్పినట్లు కారు మాయింటిముందు వచ్చినప్పటికి నాభర్తగారికి కొంచెము తెలివివచ్చెను. అయినను వారు మిగుల నిద్రవలన బధ్ధకముతో నున్నట్లు తూలిపోవుచుండిరి. కారునుండి దిగవలసినదని ప్రసాదరావుగారు వారిని హెచ్చరించిరి. మేమంత శ్రమలేకుండ వారిని లోనికి దీసికొనిపోయి పరుండజేసితిమి.

"ఆయనకింకను చాలబధ్ధకముగా నున్నది. ఇక్కడికివచ్చితినని కూడ తెలుసుకోలేనంత చైతన్యశూన్యులైయున్నారు. ఒక గంటలో బాగా తెలివివస్తుంది ఈలోగా మఱల ఒకసారి పట్టాభిరామయ్యగారి యింటికి పోయి చూచివద్దాము. వస్తారా?"

మేము మఱల పట్టాభిరామయ్యగారి ఇంటికి వచ్చి చూచితిమి. వారియింటివద్ద వాకిటనున్న సేవకులు మమ్మలను జూచి "దయచేయండి బాబు! తమరు వస్తారని, వస్తే లోనికి రానియ్యవలసిందని మాబాబుగారు చెప్పేరు. రండి బాబు. మీరు వచ్చేవఱకు ఎందుకూ కూడ తమగది తలుపు తియ్యవద్దని చెప్పేరు. అది వారికి మామూలు."

"అవుతే మేమే ఆగదిలోకి వెళ్లి ఆయనను కలసికొంటాము.—ఈహాలు చీకటిగావుందేమి?"

"బాబు! హాల్లో దీపంవుంటే వారికి చికాగ్గావుంటుంది. ఎలక్ట్రిక్ లైటు వేస్తానుండండి—అదే మాబాబుగారి గది. వ్రాసుకుంటూ కూచున్నారు. దయచెయ్యండి బాబు!"

తలుపువద్ద ప్రసాదరావుగారు.

"అమ్మా మీరు ధైర్యంగావుండి చూడగలిగితే రండి.—ఇందులో చాలఘోరం చూడబోతారు."

నేను సమ్మతించితిని. తలుపు తెఱచి ప్రసాదరావుగారు వెంటనే మూసివేసిరి.

"చూడండి! పాపం ఆయన చచ్చిఉన్నాడు.-మోహనరావుహత్యతరువాత ఇది రెండవహత్య."

పట్టాభిరామయ్యగారి మూర్తి కుర్చీలో మిగుల భయంకరముగ నాకు కానవచ్చెను. వారితల ఎదుట టేబిలు మీదనున్న అట్టపై వ్రాలిపోయియుండెను. ముందున్న బ్లాటింగ్ కాగితపు అట్ట రక్తమయమై యుండెను. వారు వ్రాయుచున్న కాగితముకూడ రక్తసిక్తమై యుండెను. వీపుపై రివాల్వరుతో నెవ్వరో వెనుకనుండి కొట్టినట్లు గాయముండెను. కొయ్యబారిపోయిన వారి కుడిచేతియందు వ్రాయుచున్న కలమట్లేయుండెను. మేము పట్టాభిరామయ్యగారి కుర్చీకి వెనుక పార్శ్వమున నిలువబడి కాగితమునకు పైభాగమున వ్రాయబడియున్న ఈ క్రింది పంక్తులను చదివితిమి: ౫వ పేజీ

"—ఇట్టిపరిస్థితులలో నాక్లయంటు కోరిన సంగతులను తెలుపకుండ నుండజాలకపోతిని. అంతవఱకు మహాభయంకరమగు ఆవ్యాధియొక్క చిహ్నము లెవ్వియు కనుపించియుండలేదు. కాని—" అంతటితో పట్టాభిరామయ్యగారి వ్రాత కాశ్వాసాంతమైపోయెను.

ప్రసాదరావుగారు ముందుండవలసిన నాలుగు పేజీలను చూడగోరి అంతటను వెదకిరి. ఎచ్చటను లేవు. పట్టాభిరామయ్యగారు నాటిరాత్రి తయారుచేయుదుమని చెప్పిన ఆస్టాట్యుటరీ స్టేట్మెంటునందలి కడమ భాగమంతయు మాకు దొరకకుండ మాయమైపోయెను. ఎంతధైర్యముగనుండ నూహించినను నాకీ హత్యాదృశ్యము రణకంపమును కలుగజేసెను. హృదయముననేదో పీకినట్లుండుటచేత నచ్చట నొకకుర్చీపై కూలబడితిని.

ప్రసాదరావుగారు నాయవస్థను గమనించి తమ పరిశోధనమును ముగించిరి. అవ్వల తోట వైపునకు తెరువబడియున్న గవాక్షమును మూసివైచి నన్ను తీసికొని గదిఈవలకువచ్చి తలుపులకు తాళము వేసిరి.

సేవకునిబిలిచి సూక్ష్మముగ తాము జూచిన దారుణమును వానితో చెప్పి 'ఇంట మఱెవ్వరును లేరా?' అనియడిగిరి.

"బాబు! చిన్నబాబుగారు భార్యతో చెన్నపట్నం వెళ్లారు. రేపుదయం వస్తారు." అని వాడేడువనారంభించెను.

"ఏడుస్తే వినియోగంలేదు—" అని మాకారుడ్రైవరును పిలిచి సమీపమున పోలీసుస్టేషనుల వద్దనున్న ఇన్స్పెక్టరును తోడ్కొనిరమ్మని ఉత్తరువుచేసిరి.

కొంతసేపటికి ఇన్స్పెక్టరు వచ్చెను.

"ఇన్స్పెక్టరు! ఈపట్టాభిరామయ్యగారు స్టాట్యుటరీ స్టేట్మెంటొకటి తయారుచేయుచున్నట్లు నాకు తెలసినది. ఆసందర్భంలో ఇక్కడకు వచ్చాను- ఈకేసు నీవుచూడు. నేనువచ్చి చూసేటప్పటికి ఆయన చంపబడిఉన్నాడు. ఆయన స్టేట్మెంటు మొదటి నాలుగు పేజీలు లేవు. మిగిలిన సంగతులన్నీ నీవే కనిపెట్టు." అని గదితలుపు తెఱచి చూపించిరి.

ఇన్స్పెక్టరు గది నాలుగువైపులును పరీక్షించెను. పట్టాభిరామయ్యగారు వ్రాసికొనుచున్న కుర్చీ చెంత తనకాలికేదో వస్తువు తగులుటచేత ఇన్స్పెక్టరు వంగి దానినందుకొనెను. నేను నిర్ఘాంతపోతిని. అది నా భర్తగా రుపయోగించు వెండిసిగరెట్ల పెట్టె. "ఏమిది? దీనిపై యస్. ఆర్. అను అక్షరములున్నవి?" ప్రసాదరావుగారు "పరీక్షలో అది నాచేతినుండి క్రింద పడిపోయింది. కారునుండి దీని నిచ్చటకు తెచ్చితిని. కారు రాజశేఖరరావుగారిది. ఈ వెండిపెట్టెయు వారిదే. 'డ్రైవింగ్ వీల్'నకు చేరువ ఒక కేన్వస్ బేగ్లో ఇది ఆయన ఎప్పుడూ వుంచేస్తారు." అని వారు దానినందుకొని తమ జేబులో నుంచుకొనిరి.

హత్యావిషయకమగు వార్త అక్కడ చుట్టు ప్రక్కల యిండ్లకు వ్యాపించుటచే కాబోలు కొందఱు జనులు వచ్చి వాకిటమూగిరి. ప్రక్కయింటియజమాను డొకడు తనదొడ్డినుండి ఏమోవినినట్లు, చూసినట్లు చెప్పుచుండెను. ప్రసాదరావుగా రతనిని పరీక్షించిరి.

"మీకేమి కనుపించింది?"

"ఆకిటికి కెదుట మాదొడ్డియందుంటిని. మొదట ఆగవాక్షంలో ఎవరో కూర్చున్నట్లనుకొన్నాను. తరువాత 'సైలెన్సరు' (శబ్దనిరోధకసాధనము) తో ఉపయోగింపబడిన పిస్తోలుచప్పుడువలె వినుపించింది. అప్పుడు నేనాగవాక్షమున కెదుట లేను. కొంచెమావలి

టిక్కుగ నుంటిని. అంతలో నెవ్వరో పెరిదొడ్డిలో నడచి యావలకు బోయినట్లు, వారిగేటు వేసినట్లు కనుపించింది."

తరువాత ప్రసాదరావుగా రొకకారుమీదను, నేను మొదట తీసుకొనివచ్చిన రోల్సుకారుమీదను బయలుదేరి మాయింటికి వచ్చివేసితిమి. అప్పటికింకను నాభర్తగారికి మెలకువ రానేలేదు.

వారిని శయనింపజేయుటకుముందు నేను చిలుకకొయ్యకు తగిల్చియుంచిన వారి కోటునంత ప్రసాదరావుగారు పరీక్షించిరి. లోపలిజేబులలో బాగుగ సీలు చేసియున్న కట్ట యొకటుండెను. ప్రసాదరావుగారు బొమలు ముడిచివైచి దానిని విప్పిరి. దానిలో రమారమి ఒక వంద నూరు రూపాయిల సరియైన క్రొత్త నోట్లుండెను.

తరువాత ప్రసాదరావుగారు నాభర్తగారిని కదిపి చూచిరి. ఆయన మిగుల చికాకుతో కన్నులను విచ్చిరి. మఱల మూసికొనిరి. ప్రసాదరావుగారు ఎలక్ట్రిక్ లైటును దీసి దానిని నాభర్తగారి కండ్ల యెదుట నుంచిరి.

"ఏమి టోగొడవ?—"

"నిక్షేపంవంటి నాబ్రతుకును గోదావరిలో కలిపేసినావయ్యా! ఒక్క ఏడాదిలో నేను పెన్షను తీసుకొని హాయిగనుండిపోవలసినవాడను. ఇప్పుడు నా ఉద్యోగ మూడిపోవుటకు సిద్ధంగావుంది నాబ్రతుకిట్లు పరశురామప్రీతి యగుటకు ఈనాటి తమచర్యలే మూలమని తెలుసుకోండి. నాఉద్యోగం తగులడ్డమేకాకుండా మీదయవల్ల నేను కృష్ణజన్మస్థానానికి కూడా పోయే యోగ్యత తటస్థించేలాగుంది."

"హౌతే ఇదేం గ్రహచారం?— నేను కాకినాడవచ్చాను?"

"మీకేం బాబు మహారాజులు! మీఇంట్లో బంగారం ఎప్పుడూ కుళ్లిపోతూవుంటుంది. ఎక్కడకు వచ్చినా హాయిగా కూర్చోడం నిద్రపోడం, కంటె మీకు వేరేపనిలేదు. మీసహవాసాలవల్ల ఏమయినా వస్తే మాకు ముందు ఉద్యోగాలూడిపోతాయి— అమ్మా, ముందొక కప్పుకాఫీ ఘాటుగా చేయించి పట్టుకురండి. అప్పు డీయనకు సంగతులన్నీ బోధపడుతాయి,"

కొంతసేపటికి నేను కాఫీ తయారుచేయించి పైకిపట్టుకొని వచ్చితిని.

"నాచేతులు కట్టివేశారు." అని నాభర్తగా రనుచుండిరి.

"ఏ మాలోచన చేశారేమిటి?" అని నే నడిగితిని.

"రాజశేఖరరావుగారికి గొప్ప ఒరిజినల్ ఐడియా ఒకటి తట్టింది. వెంటనే సమీపంలో వున్న పోలీసు స్టేషనుకు వెళ్లి తానే ఈరెండుహత్యలును జరిగించినట్లు ప్రకటనచేస్తామని చెప్పేరు. కాని అలాచేయడంవల్ల తమ భార్యను, ఈజిల్లా పోలీసుసూపరింటెండెంటును, ఇంప్లికేట్ చేయవలసివస్తుందని మిక్కిలి దయతో ఈలాంటిపరిస్థితులని గమనించి ఊరుకున్నారు:— ఇప్పుడు డాక్టరు రంగాగారిని వెంటనే కబురుచేయండి. అత్యావశ్యకమైన పనివుండి రాజశేఖరరావుగారు తీసుకు రమ్మనమని చెప్పినట్లు కారుపంపండి. నే నిక్కడ ఉన్నట్లు ఆయనతో చెప్పవద్దని డ్రైవరుతో స్పష్టంగా చెప్పండి.'

డాక్టరుగారు వచ్చునప్పటికి నేను క్రిందనుండి వారిరాకకై ప్రతీక్షించుచుంటిని. ఆయన వచ్చినప్పుడు తానే వారితో సంభాషింతుననియు, కావున మీ రేమియు మాట్లాడవలదనియు ప్రసాదరావుగారు నాతో చెప్పియుండిరి.

"ఏమమ్మాయి, ఇంతఅర్జెంటుగా కబురుచేశారు! రాజశేఖరరావుగారు వచ్చారాయేమి?— ఎప్పుడు వచ్చారు? ఎలావచ్చారు? నేను నిద్రబోతూవున్నా. మీడ్రైవరు జలగలా పట్టుకొని వచ్చేవరకు వదలి పెట్టలేదు,— నాకు తలనొప్పిగాకూడా వుంది."

అంతలో ప్రసాదరావుగా రక్కడకు వచ్చిరి. ఆయన నవ్వుచు 'హౌతే డాక్టరుకే తలనొప్పి వచ్చిందీ!

తెల్లవారేసరికి నాకు తప్ప మిగిలిన వాకందఱికి తల నొప్పులు వచ్చితీరుతాయి".

"ఓహో! సూపరెంటెండెంటుగారా! ఇంత రాత్రివేళ ఇక్కడ వుండిపోయినారేమి?—" అని చెప్పుచు నాభర్తగారు మధుసేవా సక్తులైన డాక్టరు గారికి ఇంకను వారిస్నేహితుల నిమిత్తమై ఏర్పాటుచేసి యుంచిన ఒకబల్లవద్దకు వెళ్లి అక్కడ నొక మీట (స్ప్రింగ్) నొక్కిరి. వెంటనే రంగురంగుల మధుద్రవములుంచిన సీసాలు(cellarette)బల్లపై తెఱచుకొనెను.

"కూర్చోండి ప్రసాదరావుగారు! ఇది రాజశేఖరరావుగారి ఇల్లైనా ఇది నాస్వంత గృహంలాగే చూసుకొంటున్నాను. విజయలక్ష్మి సాక్షాత్తు నా పుత్రికారత్నం—— అవుతే మీ రేంతాసుతారు చెప్పండి?"

"నాకు ఆసెస్టువాటరే (ద్రోహముచేయనినీళ్లు) కావాలి. కిప్లింగ్ వ్రాసినట్లు నేను స్లాటరు (హత్య)చేయ బోతూవున్నప్పుడు, నేను చేసేపని వాటరుతోటే జరిపేస్తాను."

డాక్టరునవ్వుచు "ఔతే ఈరాత్రి మీ రెవ్వరిని స్లాటర్ చేస్తారేమిటి?" అనియడిగెను.

"అదే యింకానిశ్చయం చెయ్యలేదు. ముందు మీరుతాగి ఇలారండి."

డాక్టరుగారుముఖము ముడిచి ఒకగ్లాసు విస్కీ త్రాగి వచ్చి కూర్చుండిరి.

"పాపం! పండువంటి ముసలి వాడిని—ఎడ్వొకేటును హత్యచేశారని మీకు తెలుసుననుకొంటాను. నేటిరాత్రి తొమ్మిది గంటలకు వ్రాసికొనుచుండగా కాల్చివేయబడెను."

"ఎంతదారుణం! పట్టాభిరామయ్యగారా! ఎంత ఘోరం!"

"పట్టాభిరామయ్యగారని నేను చెప్పలేదే? మీ కెట్లు తెలిసింది? కాని అట్లు చంపబడింది పట్టాభిరామయ్యగారే. ఆహంతకుడిని ప్రక్కయింటివాడు చూసినట్లు చెబుతున్నాడు. కాబట్టి ఇప్పుడు ఎరెస్టు చెయ్యడానికి—"

డాక్టరుగారి ముఖము వివర్ణమైపోయెను.

"మనుష్యులని కాదు. ఐడిల్ రూమర్లు (నిరర్థకమైన వదంతులు) పుటుతూ వుంటాయి. వాటిని ఎరెస్టు (అడ్డగించుటకు) చేయుటకు మీతో చెప్పేది యేమంటే— ప్రసాదరావుగారీరాత్రి పట్టాభిరామయ్యగారి యింటికి వెళ్లారని— ఇలాంటివార్తల కేమయినా అవకాశం ఉండకుండా చెప్తున్నాను." అని ప్రసాదరావుగారు మిక్కిలి యసందర్భముగ పలికిరి.

"ఎంతఘోరం!"

"అవుతే రాజశేఖరరావుగారిని మీ రెక్కడ వదిలేశారు చెప్పండి?"

"రాజమండ్రీలో వారియింటివద్ద. - తాను అర్జెంటుగా పోవలసి వుందనీ, పట్టాభిరామయ్యగారిని చూడవలసివుందనీ చెప్పేరు. నేను ముందు బయలుదేరి నా కారులో వచ్చేశాను."

"అవును రాజశేఖరరావుగారు తిన్నగా ఇక్కడకు వచ్చారు. కాని ఏమో మిక్కిలిజబ్బుగా ఉన్నట్లు కనుపించేరు. ఆయనను నేను సమాధానపెట్టి ఇంట్లోవుండమని వారిభార్యతో పట్టాభిరామయ్యగారి ఇంటికి వెళ్లి చూశాను. అక్కడ ఆయన చచ్చిఉన్నాడు."

"ఆయన ఎలా చచ్చియున్నాడు?"

"దౌర్జన్యంలో ఆరితేరినహంతకులు వట్టి కథలలోతప్ప తమ ఆయుధాలను హత్య జరిగినచోట ఉంచేసిపోరు. అయినా రేపు ఉదయం తోటంతా బాగా పరీక్షచేసి చూస్తాము."

"ఇదే నాకు కథగావుంది. అవుతే నన్నిప్పుడేమి చెయ్యమంటారు?"

"మీరు డాక్టర్లు. హియోసిన్ (Hyoscin), మార్ఫైన్ (morphine) ఈరెండుని సబ్క్యుటానియస్‌గా (subcutaneously) ప్రయోగంచేయబడినప్పుడు దానికి విఱుగుడేమో సెలవియ్యండి.—ఆహా!

సబ్‌క్యుటానియస్ అన్నమాట మహామనోహరంగా వుంది!"

"దీన్నే తెలియనివాళ్లు ట్వైలైట్ స్లీప్ అంటారు."

"నే నంత తెలియనివాడను కాను. అయినా నేను కూడ అల్లే అంటాను."

"మీ కేవిటుగుడు కావాలో నాకు తెలియ కుండా వుంది. అవి సరిగా యిస్తే అపాయం లేదు."

"ఓహో! క్వాలిఫైడ్ డాక్టర్లు మీరు సెలవిస్తు న్నారు!"

"మీ తాత్పర్యం నాకు బోధపడకుండావుంది. నాకంటె క్వాలిఫైడ్ డాక్టరు మరి ఎవ్వరూ లేదు. మీరూ నేను క్రాస్‌పర్‌పసెస్ (వ్యర్థమైన ఎదురెత్తుల మీద) నడుస్తున్నాం. ఔతే నేను రాజశేఖరరావు గారికి విషం పెట్టానంటారా ఏమిటి?"

"సంగతులే విషమించిపోతున్నాయి. విషం పెట్టడంకన్నా, కొంప కగ్గిపెట్టడంకన్నా దారుణమైన పనులే జరిగిపోతున్నాయి. కాబట్టి మీరింతటితో రాజ శేఖరరావుగారి సంబంధం వదలుకొంటే క్షేమంగా ఉండగలరు. — ఇంతస్పష్టంగా చెప్పవలసినందుకు నాకు కష్టంగావుంది."

"మీరు చెబుతూన్నమాట నా కొక్కటి తెలియకుండా వుంది. మీరీజిల్లాలో పోలీసు శాఖను పరిపాలిస్తూవున్నారు. కాబట్టి మీ కేమన్నా, ఏమిచేసినా చెల్లుతుంది. ఇప్పటి సందర్భంలో లేనిపోనివన్నీ నాకంఠంమీదకే తెచ్చి చెబుతున్నారు. అందుచేత ఇప్పుడు నేను తప్పనిసరిగా ఆత్మరక్షణం చేసుకొనితీరాలి. కాలిక్రింద పెట్టి త్రొక్కుతూంటే ఆఖరుకి క్షుద్రమైన పురుగుకూడా పీకివదలిపెడుతుంది. రాజశేఖరరావుగారికి నేనేదో పరమశత్రుడ నన్నట్లు మీరు భావిస్తున్నారు. ఇన్నాళ్లు నేనాయనను ఎంత పూసుకొని వస్తున్నానో మీకు తెలియదు. ఇప్పుడు చెబుతా వినండి. రాజశేఖరరావుగారు తానే మోహన రావును చంపినట్లు స్పష్టంగా నావద్ద ఒప్పుకున్నారు. ఇప్పుడు నేనీవిధంగా వ్రాసియిస్తే పోలీసుశాఖాధికా రులు మీ రేంచేస్తారో చెప్పండి?"

"ఏంచేస్తానా?— వెంటనే నిన్ను ఎరెస్టుచేసి జెయిలుకి పంపిస్తాను. 50 రూ. ల నోటు నీవద్దనుంచి పోయిందని మా ఇన్‌స్పెక్టర్లే పట్టుకొన్నారు. రేపు సాయంత్రం ఈపాటివేళకు నీమీద ఇలాంటివి రెండు మూడు నాకు దొరికితీరుతాయి.— కాబట్టి కొంచెం బుద్ధిగా మసలుకో. ఈదొంగనోట్లు, ఈహత్యలు, ఈఘోర్జరిచేసిన దినచర్యలు, ఎవరు సృష్టిస్తున్నారో ఎవరు చేస్తున్నారో, వీనికంతకి సూత్రధారులెవ్వరో, నా కెప్ప టికీ తెలియదనుకుంటున్నావు. నేను తలచుకొంటే— రంగాచారీలవంటి వాళ్లు వందమందయినా నిన్ను కాపా డలేరు. రాజశేఖరరావుగారి లక్షలలో కొన్ని దొరక వచ్చునని మీరు తంత్రాలు పన్నుతున్నారు. కాని నాకంఠంలో ప్రాణంఉండగా అలాగ జరగదు. అను మానంమీద నిన్నీక్షణమే జెయిలుకి పంపగలను. కాని విడిచిపెడుతున్నాను. నడు వింక."

"మీరు చాలనిర్దయత్వం వహించారు. నే నే పాపం ఎఱుగను. రేపు కలెక్టరుగారికి విన్నపం చేస్తాను."

"కలెక్టరు వద్దకు వెళ్లినా, ఏమైనా పెత్రిపెత్రి పిటిషను లిచ్చినా చచ్చావనే నమ్మ."

అని ప్రసాదరావుగారు పలికి నాభర్తగారి యొద్దకు వెడలిపోయిరి. నేనును వారు సంభాషణమును ముగించుచుండిరని కనిపెట్టి ముందుగనే గదియావలకు వెడలిపోతిని. డాక్టరుగారు చాలతడవచ్చుట రిచ్చవడి కూర్చుండి సేవకుని బంపి నాతో సంభాషింప ప్రయ త్నించెను. ఆయనను తక్షణమే పంపించివేయవలసిన దని నాభర్తగారు తమమాటగా సేవకుల కాజ్ఞాపించిరి.

ప్రసాదరావుగారు తమజేబునుండి కాగితముతో చుట్టబడియున్న ఒకవస్తువు నీవలకు దీసిరి. అది సగము కాల్చబడియున్న సిగరెట్టు. దానిలోనుండి సన్నని ఈను వలె నున్న ఒకపదార్థము నీవలకుదీసిరి. "ఇది తమ రెక్కి వచ్చిన కారులో కనుపించింది. మీరు కాలుస్తూన్న సిగ రెట్టులోని కిదెట్లు వచ్చినదో నాకాశ్చర్యంగావుంది.

ఇది హియోస్సీన్ అనుదానియొక్కయు, మూర్ఫైన్ అను దానియొక్కయు రాసాయనిక మిశ్రమము. దీనిమహిమ వలననే రాజమండ్రీయందు తమయింటివద్ద కారునెక్కి వచ్చుచుండగా బహుశః యింటికావలిగేటువద్దనే మీారు చైతన్యశూన్యులై పడిపోయియుంటారు. తరువాత మిమ్ములను కారులోనెక్కించుకొని వచ్చి పట్టాభిరామయ్యగారి దొడ్డిలో పడుకోబెట్టి హంతకులు మీావద్ద రివాల్వరునుంచి వెళ్లిపోయి యుంటారు. ఈరాత్రి శాంతంగా మీారు నిద్రపొండి. రెండురోజులలో హంతకులు దొరికిపోతారు. శెలవు."

౧౧

పాపము పండినది

మఱునాటి యుదయమున నేను బి. యే. పరీక్షలో ప్రథమశ్రేణియం దుత్తీర్ణురాలనైతినని నాకు తంతివార్తవచ్చెను. మానసము డోలాందోళితమై యున్న సందిగ్ధసమయమున నేనట్లు కృతార్థురాలనైతినన్న వార్త నాకు సంపూర్ణమగు నానందమును కలిగింపలేదు. కాకినాడయందలి నామిత్రురాండ్రును, చిన్ననాటి సహాధ్యాయినులును నావద్దకు తండోపతండములుగవచ్చి నన్నభినందింప నారంభించిరి.

మధ్యాహ్న సమయమున ప్రసాదరావుగారి యింటి యాడువాండ్రు వచ్చి నన్ను తమయింటికి బిలుచుకొనిపోయిరి. ఒకగంటవఱకు నేనచ్చటనే గడుపవలసినదాననైతిని. ప్రసాదరావుగారి యింట నొక గదిలో నేను ఎనిమిదేండ్ల వారి చిన్నకొమరితతో నేదో మాట్లాడుచు గూర్చుంటిని.

కొంతసేపటి కావలిగదివద్దకు బోయి చూడగా నచ్చట ప్రసాదరావుగారు రంగాచారితో నేదో ముఖ్యమగు సంగతిని గూర్చి ప్రసంగించుచున్నట్లు నాకు కానవచ్చెను. రంగాచారి యేదో నాభర్తగారిని గూర్చి చెప్పుచుండెను. వారికి నేను కనుపించకుండ నీక్రింది సంభాషణము వింటిని:

"ఇదిగో రాగిరేకులతో చేయబడిన బ్లాకులు. ఆఅచ్చుయంత్రముతో నివన్నియు తోటలోని పాడుబావియందు నాకు దొరకినవి. రాజశేఖరరావుగారు తమ గృహమును సోదా చేయుదురని ముందుగ నూహించి వీనినానూతియందు బారవేసిరి వారట్లు పారవేయునపుడు తోటమాలియు నింకను నొక మనుష్యుడును చూసినట్లు సాక్ష్యమును పట్టుకొంటిని. అచ్చుగొట్టిన నోట్లను కొన్నింటిని తగుల బెట్టి వారానూతిలో కలిపివేసిరి. సగం కాలియున్న నోట్లముక్క లందులో నాకు దొరికినవి. చూడండి."

"రాజశేఖరరావుగా రాయింట క్రొత్తగ ప్రవేశించిరి. అందులో గోడలోనున్న ఒకరహస్యగృహమున నీయచ్చుయంత్రం ఉందని మోహనరావు వ్రాసిన ఉత్తరమునుబట్టి కదా నీ వక్కడకు వెళ్లేవు! మోహనరావునకు రాజశేఖరరావన్న గిట్టదు. పైగ క్రొత్తగ వారంరోజులయి ఆయింట ప్రవేశించిన రాజశేఖరరావు గోడలోనున్న ఆగది ఎట్లాచేయించుకొన్నాడు? దొంగనోట్లు కొన్ని మాసములనుండి మనకు దొరుకుతున్నాయి. ఆయింట చాలకాలమునుంచి దొంగనోట్లు తయారగుచుండియుండవలెను. — అవునే, నీభార్య లెఖ్ఖలలో నుండునట్లు ఇంపీరియల్ బ్యాంకిలో నీవిచ్చిన ఇరవైవంద రూపాయలనోట్లును సరిగా గవర్నమెంటువారి టంకసాలలో తయారుచేయబడినవే యని నేను భావించవచ్చుననుకొంటాను."

"ఒక ఇరవైవందరూపాయిలనోట్లా! తమరు సెలవిచ్చేసంగతి నాకు బోధపడకుండావుంది. క్షమించండి."

"ఆనోట్లనంబర్లన్నీ నేను నోటు చేసుకున్నాను. అవి డాక్టరు రంగాగారి బ్యాంకినుంచి వచ్చాయి. నీభార్య ఎక్కౌంటులోకి చేరాయి. నా కాశ్చర్యం వేసింది. ఏదైనా పేటెంటు మెడిసిన్ (రిజస్టరు చేయబడినమందు) తయారుచేసే గ్రేండ్ ఐడియా (గొప్ప ఊహ) డాక్టరుకి రెండువేలు తీసుకుని అమ్మేశావేమో యని ఊహించాను. అలాకాకుండా ఈరెండువేలున్నూ వట్టి బహుమానంగా తీసుకొన్నయెడల అది పోలీసు చట్టాలకు వ్యతిరేకమని స్పష్టంగా నీవు తెలుసుకోవాలి.

ఆ రెండువేలు విలువచేసే ఏవస్తువు నీవు డాక్టరుకి దఖలు పరిచేవో చెప్పు. పదహారేళ్లనుంచి గవర్నమెంటు నీకు జీతంఇస్తున్నారు. కొన్నాళ్లకు పెన్షన్ ఇస్తారు. బుద్ధిగా నౌఖరీచేస్తే నీకివి శాశ్వతంగా ఉంటాయి. ఈనౌఖరీకి నువ్వు తిలోదకాలొదులుకుని డాక్టరు చేతికింద రెండువేలకు నౌఖరీకి కుదురుకుంటే నీవంటి మూర్ఖుడెవడైనా ఉంటాడేమో చెప్పు?—ఇప్పుడీ బ్లాకులు ఈఅచ్చుయంత్రం వీటిని గూర్చి ఏంచేస్తావు?"

"నే నొకరిపోర్టు తయారుచేశాను. చిత్తగించండి."

"కొంచెం ఆగు. ఈవస్తువులన్నీ నీ వొకతోటలో ఒకబావిలో పట్టుకొన్నట్లు వ్రాస్తే అందరికి భద్రము. అలాకాక నీవు అనవసరంగా రాజశేఖరరావుగారిని గూర్చి కల్పన లేమయినా చేసివుంటే నీరిపోర్టు వేస్టు పేపర్ బేస్కెట్‌లోకి వెళ్లిపోతుంది. అందుచేత జాగ్రత్తగా ఆలోచించుకో."

"రిపోర్టు సరిగా వ్రాసిఉండను. ఇంకొకటి తయారుచేస్తాను.."

"రంగాచారి! నీవిప్పు డెంతజాగ్రత్తగా వుంటే అంతమంచిది. పోలీసువారి రూల్సు నేనుకూడ అతిక్రమించుతూనే ఉండవచ్చు. అందుచేతనే కాబోలు నీలాగ జన్మం అంతా రూల్సుకు వ్యతిరేకంగా పోయే వాళ్లంటే నాకు కనికరంతోస్తోంది.—రాజశేఖరరావుగారంటే ఒకమనీమేకింగ్ ప్రొపొజిషన్ (ధనార్జనకొకసాధనము)గా డాక్టరుచూస్తున్నాడు. డాక్టర్ని మనీమేకింగ్ ప్రొపొజిషన్‌గా నువ్వాలోచిస్తున్నావు. ఇలాంటి వెర్రివెర్రి ఆలోచన లింతటితో కట్టిపెట్టు. ఇరవైనాలుగు గంటల్లో నీఆశలు, డాక్టరాశలు అడుగంటి తీరుతాయి."

నే నచ్చట నిలువక వేరొకగదిలోనికి వచ్చి కూర్చుంటిని. కొంతసేపటికి ప్రసాదరావుగారు వచ్చి "రంగాచారితో చిన్ననాటకం ఆడవలసివచ్చింది. అది మీరు ప్రేక్షకులై చూచి ఆనందించినట్లున్నారు. మోహనరావు చచ్చిపోయిననాటిరాత్రి కుక్కను వదల్చుకొన్న తరువాత రంగాచారిఇంటికిపోయినాడట. రంగాచారి అప్పుడు కాకినాడలో ఉన్నాడు. మోహనరావా రాత్రే తాను మీయింట్లో ఏవో చూశానని, వెళ్లి సోదాచూస్తే పట్టుబడిపోతాయని ఒక ఉత్తరం కాకినాడ రంగాచారి పేర వ్రాశాడు. రంగాచారి కావుత్తరం కొంచెం ఆలస్యంగా అందినది. ఏవేవో పట్టుకువచ్చినాడు. ఐనా మీరు మరేమీ ఆందోళన పడకండి." అని చెప్పిరి.

వారియింట మఱికొంతసేపు కూర్చుండి తరువాత నేను మాఇంటికి వచ్చివేసితిని. ఆహా! ఎట్టిసంబంధమును లేని ప్రసాదరావుగారికే ఇంత నిర్వ్యాజానురాగ మున్నప్పుడు, ధర్మపత్నినగు నాకు వారిపై నెంత ప్రేమయుండవలెను! అని భావించితిని.

* * * *

"నాభర్తగారికి పిచ్చియున్నదా?"

"..............."

"చెప్పండి. ఇన్నాళ్లూ మీరొక కపటనాటకం ఆడుతున్నారుకాని ఇకసాగదు. ఆయనను వెంటనే సురక్షితమైనచోట వుంచి చికిత్స చేయించవలసి వుందా? చెప్పండి."

"ఇదెక్కడిప్రశ్న! — పోతే మనకందఱకు పిచ్చ లేదూ! ఆయన కదో ధోరణి."

"కాదు. గోడమీదిపిల్లి వాటంగా జవాబుచెప్పకండి. నేనడిగిన ప్రశ్నకు సరిగా సమాధానం ఇవ్వండి. ఉంటే ఉన్నదని చెప్పండి. లేకపోతే లేదని చెప్పండి."

"ఆయనశరీరస్థితి ఆయనకు సంబంధించింది. ఆయన అనుజ్ఞలేనిదే నే నేమీ చెప్పలేను."

"ఆయనశరీరస్థితి నాకూ సంబంధించిందే. ఆయన కష్టసుఖాల్లో సమభాగినురాలను నాకే ఆయన శరీరస్థితితో నిమిత్తంలేదని చెప్తారుకాబోలు!"

"ఈసంగతి మీనాయనగారికి తెలుసుకాబట్టి ఆయన్నే అడుగు."

"నేను మిమ్మల్ల నడుగుచున్నాను. మీరు నాకు యుక్తసమాధానం చెప్పండి.—లేనియెడల వెంటనే

దయచేసి ఇకముందెప్పుడు మాగుమ్మము తొక్కి ఈవలకు రాకండి."

"అమ్మాయీ, నీవింత పట్టుపట్ట కూడదు. అందులో నే నన్నివిధాలా నీకు తండ్రివంటి—"

"నే నేమీ బాలికనుగాను. నన్ను మీరేమీ అదల్చివేయవద్దు. మీరు నేనడిగినదానికి సమాధానం చెప్పండి."

"ఇంత అతిశయం—"

"ఆహా! ఈరోజు నాకతిశయం కొంచెం హెచ్చుగానే ఉంది. ఇన్నాళ్లు నాకు కళ్లుమూసుకుపోయి మీచేష్టలు కనిపెట్టలేకపోయాను."

ఓహో! అంతవరకు వచ్చిందా?—అయితే చెబుతానుండు.— రాజశేఖరరావుగారికి మన స్సిమితం లేదు. ఆయనతండ్రి పట్టియున్మత్తుడని, ఆయున్మాదం వల్లనే నిండుప్రాణాలు తీసేసేవాడని నీకు తెలిసేవుంటుంది. ఆయనతల్లికి, తాతకి పిచ్చి. ఇలాగ వాళ్లవంశమంతా తరతరాలనుంచి ఉన్మాదం పీడలాగ పట్టుకొని ఉంది. నేననడం ఎందుకూ, గొప్పగొప్ప డాక్టర్లంతా ఈవ్యాధి ఏవంశంలోనైనా సాంక్రామికంగా ఉండిపోతుందని, పైకి ఒకప్పుడు కనిపించకపోయినా ఒక్కసారి పాలపొంగులా వచ్చితీరుతుందని చెప్పేరు. దీని మహాత్వంవల్లనే నీభర్తగారు మోహనరావును అవిఘంగా హత్యచేశారు. నిన్న పట్టాభిరామయ్యగారినికూడా తప్పక మీఆయనే హత్యచేసివుంటారు. ఇక ఊరుకుంటే లాభంలేదు. చేతులు కాలిపోయిన తరువాత చేసేదేమీ లేదు."

అంతలో నాభర్తగారు గదిలోనికి వచ్చిరి. "ఏమయ్యా, డాక్టరు, లెక్చరిస్తున్నావు!"

"ఇయ్యాక తప్పిందికాదు. మీఆవిడ పట్టుకుని వదలిందికాదు. కాబట్టి ఎందుకైనా మంచిదని చెప్పేస్తున్నాను.—నిన్నరాత్రి జరిగిన హత్యనుగూర్చి లోకులంతా కావల్లా కూస్తున్నారు. ఇదంతా మీమతిభ్రమవల్ల జరుగుతున్న దారుణమే అని నిజం ఎప్పటికైనా తెలిసితీరుతుంది."

"అందర్నీ నేనే చంపేస్తున్నానంటావా ఏమిటి?"

"ఆహా! ఈరెండుహత్యలు మీచేతనే జరిగాయి. నేను ప్రత్యక్షంగా చూసినట్లు చెప్పగలను."

"నా మనస్సాక్షికి విరుద్ధంగా—నా పంచేంద్రియజ్ఞానానికి విరుద్ధంగా నేనలా ఊహించలేను."

"మీ పంచేంద్రియసాక్ష్యాన్ని బట్టి వెళ్లేబదులు యం. బి. సి. యం. లు చదువుకొన్న మమ్మల్నందరిని బంగాళాఖాతంలోకి తోసేస్తేమంచిది."

"అవుతే ఏమంటావో చెప్పు?"

"లక్షణా లింతస్పష్టంగా కనుపిస్తూవున్నపుడు మీరు ముందే జాగ్రత్తపడి ఆస్తికంతకు మీభార్యను నిర్వాహకురాలిని చేసి మీరేదయినా సురక్షితస్థానంలో ఉండి చికిత్సపొందుతే మంచిది. ఆమె చక్కబెట్టుకోలేనియెడల జనార్దనరావుగారు, నేను ధర్మకర్తలుగా వుండి వ్యవహారం నడిపిస్తాం. మీరు ఆస్తి విజయలక్ష్మిగారిపేర వ్రాసియివ్వండి."

"ఆరి! నిన్ను తగలెయ్యా! నీమనస్సులో ఎంత ఊహవుంది?"

"తమరు శాంతంగా ఆలోచించండి. అట్టె ఎక్సైటెడ్ (ఆగ్రహించ) కాకండి."

అప్పుడు నేను "మీరేవో పెద్దయెత్తులమీద నాచేత నాటకం ఆడిద్దామని చూస్తున్నారుకాని వారు ఆస్తి నాపేర వ్రాసిఇచ్చుటకు నేనెంతమాత్రం అంగీకరించను. ఇంతకు నా ఒప్పుదలమీదకదా మీరు దీనికంతటికి నిర్వాహకుల మనిపించుకోగలరు? మీరేవో లక్షణాలని చెబుతున్నారు. అవేం లక్షణాలో చెప్పండి." అని డాక్టరు నడిగితిని.

"ఒకటా రెండా?— ఎన్నని చెప్పను? ఆయన రూపులో, చూపులో, నడకలో, తలపులో, మాటలో — సమస్తచర్యల్లోను ఈయన సామాన్య మానవుల వంటివాడుకాడని ఋజువుచేయతగిన లక్షణాలెన్నైనా ఉన్నాయి. అయితే డాక్టర్లకళ్లకిగాని అవి సూక్ష్మంగా కనుపించవు."

"అయితే ఈలక్షణాలన్నీ ఘనవైద్యులకుంవటికి కనుపిస్తాయంటారు! మెంటల్ కేసుల్లో స్పెషలిస్టులని జగద్విఖ్యాతిపొందిన డాక్టరు యస్. యస్. సర్కారు గారికి, డాక్టరు టి. యస్. మెహతాగారికి, డాక్టరు శరదాచారిగారికి—వీరందఱికి తెలుస్తాయా చెప్పండి!"

"ఆహా! నిస్సంశయంగా వారందఱికి చూపించి నీభర్తగారి కీలాంటి లక్షణాలున్నాయని సర్టిఫై చేయించగలను."

"మీ కంత శ్రమవద్దు. ఈ డాక్టర్లంతా ఈ ఉదయమే ఇక్కడికి వచ్చారు. మొన్ననే టెలిగ్రాములమీద పిలిపించాను. ఈరోజు ఉదయం వారందఱు ఏరోప్లేన్ల మీద ఈవూరు వచ్చారు. నాభర్త గారికి ఉన్మాదలక్షణాలేమీ లేవని రూఢిగా వ్రాసియిచ్చారు. ఇదుగో చూడండి. దీనికి వ్యతిరేకంగా మీరింకా పిచ్చి ఉన్నదంటారా?"

డాక్టరు నిర్ఘాంతపోయెను. కొంతసేపటికి—"వీళ్లంతా గొప్పవాళ్లే కావచ్చు. అయినా వాళ్లకీకేసు సంగతి ఏమీ తెలియదు. మోహనరావును ఈయన హత్య

"చేత నొక యాకును పొడవుగలిగి, లావైన 'అహాం:ష్ట్రా

చేసినసంగతి వాళ్లకింతమాత్రం తెలియదు. పైగా నిన్నరాత్రి జరిగిన దారుణం వాళ్లకు తెలియదు. ఈయ నను చాలకాలం పరీక్షించి తెలుసుకొన్నవాడను నేను. కాబట్టి నేనే చెప్పాలి. మోహనరావు హత్యచేయబడ్డట్లు, వెంటనే ఉదయం లేచి రక్తపు గుడ్డలతో ఉన్న ఈయనను చూసినట్లు చెప్పిఉంటావనుకో. అలా చెబితే ఈడాక్టర్లేమని ఉంటారు ?"

"ఓహో! ఇంత తెలిసినవాడవు ఆయన ఆగుడ్డలలో అక్కడికెలావచ్చాగో నీవే చెప్పాలి."

"కథ అడ్డంగా తిరిగిపోతోంది. కాబట్టి యింక ఇలాగ ముసుగుల్లో గుద్దులాడితే ఏమీ లాభంలేదు. రాజశేఖరరావుగారు! మిమ్మల్ని నే నింక వదలివేస్తాను. మీకు సంపూర్ణంగా మనశ్శాంతి కుదిరే ఉపాయం ఒకటి నావద్ద ఉంది. ఒక ౧౦వేలు ఇస్తే ఆరహస్యం మీపరంచేసి నేను వెళ్లిపోతాను. ఇదంతా రిడిక్యులస్ (హాస్యాస్పదము) గా వున్నట్లు

రోకలితో వెనుకవైపునుండి వచ్చి"

మీకుతోస్తుంది. కాని మీమనస్సు కికయేవిధమైన తొందరలు, యెట్టి విచారము లేకుండా చెయ్యగలను. మీకు కొత్త మోస్తరైన 'ఔట్ లుక్' వచ్చి తీరుతుంది మీరు వెంటనే నిర్ధారణ చేసిచెప్పండి."

"నువ్వింత దురాశాపాతకుడవని ఇంత తుచ్ఛుడవని నేను కలలోకూడ అనుకోలేదు. ఇన్నాళ్లు నన్ను మోసంచేసి ఇన్ని నాటకాలాడేవు. ఇంక నా కొంప లోకి రాకు. నీకపటవేషాలకి ఆశ్వాసాంతమైపోయింది. నడువు!" అని నాభర్తగారు క్రోధతీవ్రమున కన్నుల నిప్పులురాలునట్లు చూసి కుర్చీనుండి లేచిరి.

డాక్టరు తనయాట లిక సాగివచ్చుటలే దని పూర్తిగా తెలుసుకొని ఉద్వేగముగా లేచి గదితలుపుల వద్దకు బోయి వానిని దీసి మఱల నంతలో నేమను కొనెనోగాని మావైపునకు దిరిగి ఏదో పలుకబోవు చుండెను.

చూచుచుండగా మహాభయంకర మగు చర్య యొకటి మాకన్నుల బడెను. ఆ బీభత్సమగు దృశ్య మింకను నాకన్నుల కట్టినట్లే యున్నది. రూపమెత్తి వచ్చిన మహిషాసురమర్దనివలె కనులు దెఱచునప్పటికి సరస్వతి మా కగుపించెను. ఆమె యెట్లు గొట్టినదో యేమోగాని చేత నొక యడుగు పొడవుగలిగి, లావైన 'అమాందస్తా' రోకలితో వెనుకవైపునుండి వచ్చి డాక్టరుకంఠంగాతల నొక్క వ్రేటుతో పగులునట్లు కొట్టెను. దెబ్బతినుటయే తడవుగ మహాభయంకరముగ బొబ్బరించుచు డాక్టరు ముందునకు బోరలపడిపోయెను.

"చావు, చావు! మోహనరావును చంపేశావు. నిన్ను నేను చంపకుండా ఉంటానా?" అని యామె డాక్టరును ద్రొక్కుచు చేతిలోనున్న ఆభయంకరసాధనముతో నాతని తలను చితుకబొడుచుచుండెను. ఆమె పగ తీరకపోవుటచేగాబోలు ఆమె క్రోధోన్మాదమున 'కోరియోలనస్'పై నెక్కిన 'అఫీడియస్' వలె డాక్టరుదేహమును ద్రొక్కివేయుచు పాముతలను చితుకకొట్టినట్లు అతనిని చావమోదుచుండెను. అంతలో రిచ్చవడియున్న మా సేవకులువచ్చి రక్తమయమై యున్న యామెను బట్టుకొనిరి. వారామెను పట్టుకొనుచుండగా ప్రసాదరావుగారు సహిత మచ్చటికి వచ్చిరి. వారీల వేసి వాకిటనిలిపియున్న పోలీసుజవానును పిలిచి సరస్వతిని పట్టించిరి.

ఆమె తనవాఙ్మూలమిట్లు చెప్పదొడగెను:

"మోహనరావును వీడే హత్యచేశాడు. మొట్టమొదట విజయలక్ష్మిమీద మావాడికి వలపు పుట్టేటట్లు చేసి ఆమెను తప్పకుండా పెండ్లిచేయిస్తానని చెప్పేడు. మావాడు మోసపోయి ఆమెమీద మోహంగావుండి తుదకు రాజశేఖరరావుగారితో ఆమెకు పెండ్లిజరిగినా ఆమెవెనుక పిచ్చియెత్తినట్లు తిరిగేవాడు. అప్పుడు విజయలక్ష్మివద్దకు వెళ్లకూడదని, వెళ్లినట్లయితే ప్రమాదముందనీ ఈడాక్టరు చెప్పేవాడు. మావాడు వినుపించుకోలేదు. ఆరోజు రాత్రి రాజశేఖరరావును హత్యచెయ్యవలెనని సంకల్పించుకొని మావాడు పిస్తోలు తీసుకువెళ్లాడు. వెళ్లేముందు నాకు ఉత్తరం వ్రాస్తూ తనకేమైనా ప్రమాదం జరిగేయెడల నేను పగతీర్చుకోవలసిఉంటుందనీ వ్రాశాడు. ఆరాత్రే డాక్టరు మావాడిని హత్యచేశాడు. వాడిని చంపినవిధంగానే నేనూ వీడిబుర్ర పగులగొట్టి చంపేను. వాడిని అనాథని చేసి చంపేస్తే వదలిపోతాడనుకున్నాడు. ఈకాలంలో ఆడాళ్లు కలెక్టర్లనీ, గవర్నర్లనీ కూడా లక్ష్యంచెయ్యకుండా చంపెయ్యడానికి సిద్ధపడుతూవున్నప్పుడు నేను నాకొడుకుచావు తెలిసికొని ఊరుకోలేకపోయాను."

ప్రసాదరావుగారామెను తీసుకుపొండని తమ భటుల కాజ్ఞాపించిరి. ఆమెనుదీసుకొనిపోయినతరువాత ప్రసాదరావుగారు బీభత్సముగ రక్తసిక్తమై యున్న డాక్టరుదేహమును పరీక్షించిరి. జేబులలో కొన్నికాగితము లుండెను. వానిని దీసిచూచిరి.

అవి పట్టాభిరామయ్యగారు తమవాఙ్మూలమున వ్రాసియుంచిన మొదటి నాలుగుపత్రము లని మేము తెలిసికొంటిమి. అందు ముఖ్యముగ నీదిగువ వాక్యములు నాభర్తగారికి మిగుల నాశ్చర్యమును బుట్టించెను:

"వెంకటరంగయ్యగారికి రాజశేఖరరావుగారు స్వయముగ పుత్రులుకారు. వారి పెదతండ్రిగారి కొమా

రుడైన వేళొక వెంకటరంగయ్యగారు కలకత్తా విశ్వ విద్యాలయమున నధ్యాపకులుగనుండియుండిరి. ఆవెంకట రంగయ్యగారికి రాజశేఖరరావుగారు ౧౮౯౯ వ సంవత్సరము ఆగష్టు ౧౫ వ తేదీని జన్మించిరి. ఆయనపుట్టిన కొంతకాలమునకు తల్లియు, తరువాత రెండేండ్లకు తండ్రియు పరలోకగతులగుటచేత నప్పుడు రంగూనులో వ్యాపారముజేయుచున్న వెంకటరంగయ్యగారి కప్పగింపబడిరి."

"ఆహా! రాజశేఖరరావుగారు మీరెంత మోసపోయినారు! మిమ్ములను గన్న తల్లిదండ్రుల కట్టియున్మాదమును లేనేలేదు." అని తమ యాశ్చర్యమును బ్రకటింపుచు బ్రసాదరావుగా రనిరి.

"ఇదేమో చిత్రంగా ఉంది. తరువాయి చదవండి." అని నాభర్తగా రనిరి.

"మొదటినుండియు వెంకటరంగయ్యగారు రాజశేఖరరావుగారిని తమపుత్రులవలెనే మిగుల గారాబముతో బెంచిరి. ఆయన తమపెదతండ్రిగారి మనుమలని చెప్పకొనుటకు వెంకటరంగయ్యగారి కెంతమాత్రము ఇష్టముండకపోవుటచేత నాసంగతిని వారు మిక్కిలిరహస్యముగ నుంచుచువచ్చిరి. వారిధర్మపత్ని వలన వారికి సంతానములేకపోవుటచేత ఆమెయు రాజశేఖరరావుగారిని తమపుత్రులవలెనే పెంచుకొనుట కిష్టపడెను. కాని ఆకస్మికముగ నామె మరణించుటచేత వెంకటరంగయ్యగారు సరస్వతి యనునొక కన్నడస్త్రీని చేరదీసిరి. ఆమెవలన మోహనరావను నొకకుమారుడు వారికి పుట్టెను. ఆకాలమునందే వారికి సిఫిలిస్ యేర్పడినది. అది వారికి తమతల్లినుండియు, ఆమెకు తన పుట్టినింటివారినుండియు సంక్రమించెను. మోహనరావెవడో రాజశేఖరరావుగారికి కూడ తెలియనంత రహస్యముగ వెంకటరంగయ్యగారు దాచియుంచిరి. పుట్టినవెంటనే వానిని నాయొద్దకు బంపివేసి నావలననే అతని సంరక్షకులకు ధనము బంపి కాకినాడయందును, బెంగుళూరు నందును వానిని జదివించిరి. అట్లు పంపివేసినతరువాత మరల వానినెన్నడును చూచియుండకపోవుటయేగాక అతడు తమపుత్రుడని యెవ్వరికిని దెలియకుండ నుండునట్టి షరతుమీద మోహనరావునకును, వానితల్లికిని ప్రతి నెలయు గొంతసొమ్మిచ్చు నేర్పాటు చేసియుండిరి. తప్పక మోహనరావునకు ఆభయంకరమగువ్యాధి పట్టుకొనునట్లు నాకు తోచెను. వెంకటరంగయ్యగారు చనిపోయినతరువాత నే నీసంగతి పలుమార్లు సరస్వతితో చెప్పితిని.

ఈరహస్య మిట్లే యుంచవలెనని వెంకటరంగయ్యగారి యూహ. కాని పరిస్థితులు విషమావస్థకు వచ్చుచున్నవని గ్రహించి నా క్లయంటు రాజశేఖరరావుగారి మనశ్శాంతికి తోడ్పడగలదని నే నీ వాఙ్మూలమిచ్చుట కొప్పుకొంటిని."

౧౨

ఆహా, నాతండ్రి!

ప్రసాదరావుగారు జరుపవలసినరీతిగా డాక్టరు శవమును పరీక్షచేయించి మాయింటినుండి దానిని తీసుకొని వెడలిపోయిరి. తరువాత రాత్రిపదిగంట లగుచుండగా ప్రసాదరావుగారు తిరిగి మాయింటికి వచ్చి "రాజశేఖరరావుగారు లేరా?" అని యడిగిరి.

"లేరు. ఇంకా భోజనమునకైన రాలేదు. ఎక్కడికివెళ్లిరో ఏమో తెలియకుండావుంది."

"ఎప్పుడిలాగే జరుగుతుంది. పోలీసునౌఖరీలో ప్రవేశించిందిమొదలు ఎవరినోఒకరిని ఎరెస్టుచెయ్యడానికి వెళ్లినప్పుడల్లా 'ఇంట్లోవాళ్లులేరండీ! ఎక్కడికో వెళ్లారు. ఏమయ్యారో మాకుతెలియదు.' అని చెబుతూంటారు.

"అయితే రాజశేఖరరావుగారిని ఎరెస్టు చెయ్యడానికి వచ్చారా ఏమి చెప్పండి?"

"లేదు కాని, ఆయన చేసేపనులకు మరొకడైతే" చాలరోజులక్రిందటనే ఎరెస్టు చేసిఉంటాడు. ఇన్నాళ్లు ఆయన ఏమీ నేరం చెయ్యలేదు గాని ఈ రాత్రి బుద్ధిపూర్వకంగా ఈనోట్లుసృష్టి చేస్తూవున్న మారీచుడిని ఎబ్‌స్కాండ్ (పారిపోవునట్లు) అవునట్లు

సహాయం చేశారు. ఈరాజశేఖరరావుగారివల్ల కాని లేకపోతే నాకీపాటికి విజయం చేకూరి ఉండేది."

"దొంగనోట్లెవ రచ్చువేస్తున్నారో మీకు తెలిసిందా?"

"ఆహా తెలిసింది. కాని పక్షి పారిపోతూవుంటే నేనే చూసి ఊరుకోవలసింది. కారణం రాజశేఖరరావుగారు."

"ఆయనేమి చేశారు?"

"పులినోటికండను దాని కందకుండా చేసినట్లు ఈకలియుగ విశ్వామిత్రుడిని మా కందకుండా తమ్ము కారులో కూర్చోబెట్టుకుని ఏ యేనామో తీసుకు పోయారు."

"నేను నమ్మలేకుండా ఉన్నాను."

అంతలో నాభర్తగారచ్చటకు వచ్చిరి. ప్రసాదరావుగారాయనను జూచి "మాకు మంచి పరాభవం చేశారు. ఇన్ని సంవత్సరాలనుంచి నేను పోలీసుశాఖలో ఉద్యోగం చేస్తున్నాను. ఎప్పుడీవిధంగా స్నేహితుల చేతనే అవమానం పొందలేదు. నాకు 'కాన్షన్సు' అంతగాలేదుగాని స్ట్రాంగ్ సెన్సు ఆఫ్ డ్యూటీఒకటి కొంచెం హెచ్చుగా ఉంది.—మీరు నేను చెప్పేమాటలకు 'శబాస్' అనాలిగాని ఏమీ అడ్డురావద్దని ప్రార్థిస్తున్నాను. ఈదొంగనోట్లతో మీకు జోక్యం ఉందని రంగాచారి మిమ్మల్ని అనుమానించడం మొదలుపెట్టినప్పటినుంచి మధ్య నాగ్రహచారం కాలిపోతూవచ్చింది నేను చేస్తున్న పనులన్నీ రంగాచారిగాని, తదితరులుగాని కనిపెట్టి గవర్నమెంటు కెప్పుడు తెలియజేస్తారో అని నాకు సందేహం కలిగేటట్లు జరిగింది. ఇక రెండేళ్లిందిగైనా గడుపుకుంటే నాకు నాపెన్షన్ వచ్చేస్తుంది. కాని నాలో వున్న 'సెన్స్ ఆఫ్ డ్యూటీ' నన్ను వెంటనే రాజీనామా దాఖలుచేసుకోమని చెబుతోంది. కాబట్టి వెంటనే అలాగుజరిగిస్తాను. భగవంతుడిచ్చిన బుద్ధి, దాన్నిబట్టి వచ్చిన అనుభవం సరిగా వినియోగించుకుంటే నాకెక్కడనో ఒకచోట బ్రతుకుగడవక పోదు."

"మీకెరీర్ పాడుచేసుకోకండి. మీబ్రతుకు నావల్లనే పాడైనదని నాకు స్పష్టంగా తెలుసుకాని—"

"మీరుకాదు. ఆభగవంతుడే ఇలా చేశాడు. నిన్నరాత్రే నాకు డాక్టరుమీద, మీమామగారిమీద అనుమానం తట్టింది. డాక్టర్ను బుద్ధిపూర్వకంగా వదలివేశాను. జనార్దనరావుగారిని మీచేతుల్తో దాటించేశారు. ఇక అందుగూర్చి మిమ్మల్నేమీ ప్రశ్నించను. కాని వీళ్లిద్దరు ఇన్నాళ్లు మాకన్నులకు గంతలు కట్టేసి ఈదొంగనోట్లు అచ్చువెయ్యడం—వాటితో దేశమంతా ఒకనాటకం ఆడడం అదే నాకు ఆశ్చర్యంగా వుంది. మీసంబంధమును చూసి నేను మొదట అనుమానించలేకపోయాను."

నాకు మిన్ను విఱిగి మీదబడినట్లయ్యెను.

"అట్లయిన ఈదొంగనోట్లు మా తండ్రిగారే తయారుచేయించిరాఏమి?" అని మిగుల నుద్వేగముగ నంటిని.

"ఆహా, నిస్సంశయముగ — డాక్టరు చచ్చిన తరువాత డాక్టరింటికి వెళ్లి అంతా పరీక్షచేసిచూశాను. అక్కడ మీతండ్రిగారాయన పేర మద్రాసునుండి వ్రాసిన కొన్ని ఉత్తరము లగుపించాయి. అందు కొన్ని సంకేతాక్షరము లుండెను. మొదట అవి నాకు సరిగా బోధపడలేదు గాని వెదకగా వెదుకగా ఆసంకేతాక్షరముల యర్థమున్న గ్రంథమొకటి వారి ఇనుపపెట్టెయందుండెను. దానిసహాయమున వారి రహస్యములను నేను భేదింపగలిగాను. రాజమండ్రీయందు మీ రుండిన ఆ గృహమునందే వారీదొంగనోట్ల నచ్చువేశారు. డాక్టరు భార్య కమలాంబ చాలనోట్లమీద డాక్టరుగారి స్టాంపు గొట్టినదట. వాని నన్నింటిని ఆయన తగులబెట్టినాడు కాని ఒక రూ ౫౦ ల నోటుపైన స్టాంపట్లే యుండిపోయి మా ఇన్స్పెక్టర్లకి దొరికింది. ఆ యచ్చును గూర్చిన సర్వకార్యములను కాలక్రమమున మీనాయనగారు డాక్టరు కప్పగించారు. రకరకాలనోట్లు కొన్నివేలచ్చువేసినతరువాత ఆయచ్చుయంత్రమును తదితర పరికరములను గోదావరిలో పారవేయవలెనని వారు మొదట నిర్ణయించుకొనిరి. మీ కాయింటిని డాక్టరు

రంగారాయే కుదిర్చిఉంచాడు. అన్నట్లు మఱచినాను. రాజమండ్రీలో మీ నాయింటిని ఏవో క్రొత్తపేరులమీద తీసుకొన్నారు. డాక్టరు దురాశాపరుడగుటచేత ఈ దొంగనోట్లన్నియు రాజశేఖరరావుగారే సృష్టించినట్లొక కపటనాటక మాడదలచి మీనాయనగారితో తానా అచ్చుయంత్రమునకు సంబంధించిన పరికరములన్నింటిని రాత్రివేళ గోదావరిలో బారవేసితినని మీతండ్రిగారికి విశ్వాసము కలుగునట్లు చెప్పి ఆయింటిని రాజశేఖర రావుగారి వశముగునట్లు చేసెను. తరువాత రాజశేఖర రావుగారెప్పుడో ఆ అచ్చుయంత్రమున్న స్థలమును గనిపెట్టి దానిని పరీక్షించుచుండగా మోహనరావా సంగతిని గనిపెట్టి రంగాచారికా సంగతి తెలియునట్లు త్తరము వ్రాసెను."

"ఆహా ఎంతపని చేశారు!"

నాతండ్రిగారట్టి సాహసమొనర్చియుండిరని నేను విశ్వసింపలేకపోతిని. చూచుచుండగా నాకన్నుల నుండి నీరువచ్చెను. నన్నంత గారాబముగ పెంచిన తండ్రి! ఈ డాక్టరుతో జేరి తుదకు నాబ్రతుకెంత యధోగతి పాలుచేయుటకు సిద్ధమయ్యెను. ఎవడైన కన్నతండ్రి యిట్లుచేయునా?—అంతలో నాకు స్మరణకు వచ్చెను.

"ప్రసాదరావు గారు, క్షమించండి. మీకు తెలియునో లేదో! జనార్దనరావుగారు నాకు పినతండ్రి. నాతలిదండ్రులు నాచిన్నతనముననే మరణించినారు. నాతండ్రిగారు తమ యాస్తినంతయు తమ్మునకప్పగించి నా కున్నతవిద్య నొసగవలసినదని చెప్పిరి. పసితనముననే వారు గతించిపోయినను మాపినతండ్రిగారు నన్ను తమగర్భవాసమున బుట్టిన పుత్రికకంటె మిగుల ప్రేమించి పెద్దదానిని జేసిరి. అందువలన వారు నా కెప్పుడును వందనీయులే." అని కన్నీళ్లతో నంటిని.

ప్రసాదరావుగారంతట సందర్భోచితముగ నన్నాశ్వాసించి తాము వెడలిపోయిరి.

"ఎంతాశ్చర్యంగా వుంది. అయితే ఈదొంగ నోట్లు మానాన్నగారే తయారుచేశారా?"

"ఆహా ఆయనే తయారుచేశారు. ఈసంగతి స్పష్టంగా తెలిసినప్పటినుంచి నాకు మహాశ్చర్యంగా ఉంది. ఆయన స్వయంగా ఒప్పుకున్నారు. వ్యాపారమున వారికి మిక్కిలి నష్టము వచ్చినదట. అప్పుడీ డాక్టరు ప్రోత్సాహంవల్ల ఇద్దరు కలిసి నోట్లచ్చువేశారట."

"అయితే మానాన్నగారిప్పుడేమయినారు?"

"ఏవిధంగానో అమెరికాకుపోయి అక్కడ జీవించవలెనని వారియూహ. ప్రసాదరావుగారాయనను బట్టుకొనుటకై మనుష్యులను పంపేరు. వారాసంగతి ముందు తెలిసికొని యెవ్వరికీ తెలియకుండా మన యింటికి వచ్చి సంగతి నాకు విశదమయ్యేటట్లు చెప్పేరు. అప్పుడు నువ్వు మేడమీద ఉన్నావు. నీకేమీ చెప్పవద్దని కోరుటచేత నేను వెంటనే కారు ఆర్డరుచేయించి రెండవకంటివానికి తెలియకుండా మీనాన్నగారిని యానాంపంపించివేశాను."

"ఆహా ఎంత దుర్గతిపట్టినది!"

"'సాహసేలక్ష్మీః' అనే ఉత్తమాదర్శం నారీవిధంగా వక్రమార్గంలో పెట్టి సూక్ష్మంగా కోటీశ్వరులైపోవచ్చునని ఈయెత్తు యెత్తారట. ఆసాహసంతోనే డాక్టరు అన్నిదారుణాలు చేశాడని మీనాన్నగారు చెప్పేరు. ఈహత్యలన్నీ డాక్టరొక్కడే చేశాడు. మీనాన్నగారికేమీ తెలియదు."

"రాజమండ్రీలో నోట్లు మీరే అచ్చువేస్తుండగా—"

"అలాగా! అది చూసినతరువాతనేనా నువ్వు నన్నావిధంగా పలుకరించావు!— అప్పుడే నాకా అచ్చుయంత్రం కనిపించింది. నా కాశ్చర్యంవేసి అక్కడి సాధనములతో యంత్రం తిప్పిచూశాను. దానినిబట్టి ఈకలియుగ విశ్వామిత్రుడను నేనే యని భావించావు కాబోలు. శబాస్."

(సంపూర్ణము)